క్లుప్తంగా

ధనరాజులమ్మకు ప్రత్యేక పూజలు


కోయనృత్య ప్రదర్శనలో కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా ప్రాంతాలకు చెందిన అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఒడిశా సుర్లా, తేలుకుంచి కోయ నృత్య కళాకారులు ప్రదర్శించిన కోయనృత్యం అలరించాయి.

గిరిజనులకు వస్త్రదానం


తెంబురలో వస్త్రదానం చేస్తున్న దృశ్యం

కంచిలి: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని అటవీ ప్రాంతంలో నివసిస్తున్న పేద గిరిజనులకు సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆదివారం వస్త్రదానం చేశారు. సుంకిలి, అరకభద్ర, డెప్పసాయి, తెంబుర గ్రామాల గిరిజనులకు వీటిని అందజేశారు. చిన్నారులకు టపాసులు, మతాబులు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుల్ల రమేష్, సోంపేటకు చెందిన సానా గణేష్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

భయపెడుతున్న ట్రాన్స్‌ఫార్మర్!


తుప్పుపట్టిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు

కవిటి: గొండ్యాలపుట్టుగ జంక్షన్‌కు ఎదురుగా పట్టాభిరామ రైస్‌మిల్లుకు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఇనుప స్తంభాలు తుప్పుపట్టి భయాన్ని కలిగిస్తున్నాయి. కవిటికి విద్యుత్‌లైన్ ఏర్పాటు చేసిన తొలినాళ్లలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. స్తంభాలు తుప్పుపట్టి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు దానిపైకి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. సంబంధిత అధికారులు మేల్కొని తుప్పుపట్టిన ఇనుప స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వర్షం నీరు


కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికే కాంప్లెక్స్ ఆవరణలోకి వర్షం నీరు చేయడంతో చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు లోనికి రావడానికి ఇబ్బందిపడ్డారు.

నాయకుల పరామర్శ


పురుషోత్తం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన బుడ్డెపు పురుషోత్తంరెడ్డి, ముఖేష్ జెన్ని ఇటీవల మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, నాయకులు లడ్డు కేశవపాత్రో, దుర్గాసి ధర్మారావు, రంగాల శ్రీనివాస్ ఉన్నారు.

నత్తేనయం!

- జోరందుకోని పూడిలంక పనులు
- భారీ వర్షాలకు పూడిలంకవాసుల అవస్థలు
- పడవ ప్రయాణమే శరణ్యం


పూడిలంక వద్ద ఉప్పుటేరుపై అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్డు పనులు


ఉప్పుటేరులో పడవపై ప్రయాణం చేస్తున్న పూడిలంక వాసులు

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు నత్తకంటే నెమ్మదిగా నడుస్తున్నాయనే విమర్శలు ప్రజల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి. దీనికి వజ్రపుకొత్తూరు మండడంలో జరుగుతున్న కొన్ని పనులను ఉదాహరణగా చెప్పవచ్చు. పూడలంక నడకదారి, వంతెనల పనులు నత్తనడకన సాగుతున్నాయి. దశాబ్ద కాలంగా పూడలంక గ్రామానికి రహదారి నిర్మించాలన్నా డిమాండ్ నేటి వరకు సాకారం కాలేదు. దీంతో వారికి పడవ ప్రయాణమే శరణ్యమైంది. ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో ఆ పనులు ముందుకు సాగడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1.90 కోట్లు మంజూరు అయినప్పటికీ పనులు సగంలోనే నిలిచిపోయాయి. నడక దారి కల సాకారం కాలేదు. దీంతో ఆ గ్రామస్తులు కష్టాలు వర్ణనాతీతం. ఏటా భారీ వర్షాలకు ఉప్పుటేరు పొంగి పొర్లుతుండడంతో బయట ప్రపంచంతో వారికి సంబంధాలు తెగిపోతున్నాయి. వైద్యం, నిత్యవసర సరుకులు అందని ద్రాక్షగా మిగులున్నాయి. పైగా ఈ గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లాలన్నా వ్యయాప్రయాసలకు గురి కావాల్సి వస్తోంది.

పడవ ప్రయాణమే గత్యంతరం..

ఇదిలా ఉండగా ఉప్పుటేరుకు ఇరువైపులా రాకపోకలు సాగించాలంటే పడవ ప్రయాణమే గతి. రేషన్ సరులకు కోసం పంచాయతీ పరిధి పూడిజగన్నాధపురం, రెయ్యినాడుకు వెళ్లాల్సి ఉంటుంది. సుమారు ఐదు కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని గ్రామస్తులు కీలు కామయ్య, రమణమ్మ తదితరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నార. గ్రామానికి రేషన్ సరులకు తీసుకురావడం కోసం మళ్లీ పడవ ప్రయాణం ఆశ్రయించాలి వస్తోందని వాపోతున్నారు. ఎవరో పడవ నడిపే వారు ఉంటే తప్ప వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వేళ వైద్యం కోసం నరక యాతన అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.4. కోట్లు వెచ్చించి రెండో సారి శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంతో పాటు ఉప్పుటేరుపై రెండు బ్రిడ్జిలు నిర్మించి సుమారు రెండు కిలో మీటర్లు మేర తారు రోడ్డుకు నిధులు మంజూరు చేసినా ఆ పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహించడంతో పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. మట్టి గ్రావెల్ ఫిల్లింగ్ పనులు చేసే సమయంలో పాత రహదారి పూర్తిగా ధ్వంసం అవుతున్నా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అరకొర జరుగుతున్న పనులను సైతం పర్యవేక్షణ లేకుండానే చేపడుతుండంతో పనుల్లో నాణ్యతా లోపం కనిపిస్తోంది. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ ఏఈఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా.. పనులు ప్రస్తుతం నిలిచి పోయాయయని, నిధుల సమస్య ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తారు రోడ్డు నిర్మాణం రెండు బ్రిడ్జిలు నిర్మించి పనులు గడువులోగా పూర్తి చేస్తామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పాతటెక్కలిలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ముగ్గురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 32,435 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బి.నీహార్ తెలిపారు.

రూ.లక్ష వితరణ

హిరమండలం: సత్యసాయి మందిరం నిర్మాణానికి హిరమండలానికి చెందిన సింహాద్రి సాయిరాం (ఎన్ఆర్ఐ) రూ.లక్ష వితరణగా అందించారు. విదేశాల్లో ఉంటున్న సాయిరాం తనవంతు సాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. అంధవరపు అబ్బాయి, బుచ్చిబ్బాయిలకు ఈ మొత్తాన్ని ఆదివారం అందించారు. భవిష్యత్‌లో మందిరం అభివృద్ధికి తనవంతు సాయం అందజేస్తానని సాయిరాం చెప్పారు.

అవార్డు ప్రదానం



కంచిలి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న అగ్గున త్రినాథరావుకు మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు 'గురుబ్రహ్మ'స్టేట్ అవార్డు వరించింది. విశాఖ డాబా గార్డెన్‌లోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.క్రిష్ణమూర్తి, ప్రొఫెసర్ డాక్టర్ రత్నాకర్‌ల చేతులమీదుగా అందుకొన్నారు. త్రినాథరావు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును జిల్లా కలెక్టర్ నుంచి అందుకున్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన చేయడంతోపాటు సామాజిక స్పృహతో వివిధ అంశాలకు సంబంధించి 35 రచనలు చేశారు.
– కంచిలి

అ'పూర్వ' కలయిక



వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం అత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 38 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న వీరంతా ఒకరినొకరు అత్మీయంగా పలకరించుకుంటూ అలింగనం చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరివేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి గౌరవించారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూప్ ఫొటోలను తీసుకొని మురిసిపోయారు.
– వజ్రపుకొత్తూరు రూరల్

భజన కాలక్షేపం



పోటీ ప్రపంచంలో మనిషి మనశ్శాంతి పొందేందుకు ఆధ్యాత్మక సాధన, భక్తిమార్గమే మూలమని విశ్రాంత తెలుగు పండితులు, పురాణప్రవచనకర్త పండి ఢిల్లేశు అన్నారు. కవిటి మండలం చండిపురంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా ఏకాహం భజన కాలక్షేపాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రగడపుట్టుగ, కవిటి, రాజపురం తదితర సత్యసాయి భజన మండళ్లకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఏకాహం భజనకాలక్షేపంలో పాల్గొన్నారు. ఉదయం నగర సంకీర్తన, గాయిత్రి యజ్ఞాన్ని చండిపురం గ్రామస్తులల ఆధ్వర్యంలో నిర్వహించారు. పండి ఢిల్లేశు మాస్టార్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.
– కవిటి

ఆఖరి మజిలీకి అవస్థలు!


శ్మశానవాటికకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతున్న కన్నేవలస గ్రామ దళితులు

- శ్మశానవాటికకు దారిలేక కన్నేవలస గ్రామస్తుల ఇబ్బందులు


శ్మశానవాటికకు రోడ్డు లేదని చూపిస్తున్న గ్రామస్తులు

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామస్తులకు చెప్పుకోలేని కష్టం వచ్చింది. ప్రధానంగా ఈ గ్రామానికి చెందిన దళితులు శ్మశానవాటికకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్నారు. ఎవరైన చనిపోతే మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు నానాయాతన పడాల్సి వస్తుందని వాపోతున్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినప్పటికీ తమ అవస్థలను పట్టించుకోవడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని పొలాల గట్లు మీదుగా అవస్థలు పడుతూ శ్మశానవాటికకు తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోందని దళితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికకు రోడ్డు సదుపాయం కల్పించాలని వేడుకుంటున్నారు.

అవస్థలు పడుతున్నాం



మా గ్రామంలో దళితుల కోసం ఉన్న శ్మశానవాటికకు సరైన రోడ్డు లేదు. దీంతో ఎవరైన చనిపోతే మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించడం లేదు.
– కె.నరసమ్మ, కన్నేవలస, కోటబొమ్మాళి మండలం

పాలకులు స్పందించాలి



కన్నేవలస గ్రామంలో దళితుల కోసం కేటాయించిన శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించే విషయంలో పాలకులు స్పందించాలి. వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
– కె.గణపతిరావు, మాజీ సర్పంచ్, కన్నేవలస

వైద్య కళాశాలలను కాపాడుకుందాం


నరసింగపల్లిలో కోటి సంతకాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జెడ్పీటీసీ సభ్యురాలు వాణి తదితరులు

టెక్కలి: పేద, సామాన్య వర్గాల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కుట్రలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టెక్కలి మండలం గూడేం, నరసింగపల్లి, ముఖలింగాపురం పంచాయతీల్లో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కావాలనే కలలు కంటున్న పేద, సామాన్య వర్గాలకు చెందిన విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఎలా కూల్చివేస్తుందో తిలక్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వర్రావు, వైస్ ఎంపీపీ పి.రమేష్, నాయకులు సత్తారు సత్యం, కిల్లి అజయ్, సర్పంచ్‌లు పిట్ట సంతోషమ్మ, రౌతు జయమోహన్, బందపల్లి రాకేష్, నాయకులు టి.కిరణ్, జి.వి.రెడ్డి మాస్టార్, ఆర్.బృందావతి, ఎం.భాస్కర్, జి.మోహన్‌రెడ్డి, ఎ.రాహుల్, పి.వీరవసంత్, కె.చిన్నా, ఆర్.బైరాగి, నరేష్, ప్రసాద్, రామారావు, శ్రీను, ఆర్.గోవింద్, బి.ఆనందరావు, బి.శ్రీను, డి.కూర్మారావు, ఎస్.మోహన్, టి.కృష్ణారావు, ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

బాలి దీక్ష ప్రారంభం

జలుమూరు: కార్తిక పౌర్ణమి నుంచి కార్తిక మాసం ఆఖరి వరకు జరిగే బాలి యాత్ర ఉత్సవం, దీపోత్సవం పురస్కరించుకుని ఆదివారం నుంచి బాలి దీక్ష చేపట్టినట్లు బాలి యాత్ర నిర్వాహక కమిటీ సభ్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. 21 రోజులపాటు దీక్ష ఉంటుందన్నారు. శ్రీముఖలింగంలో మధుకేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. జీవితేశ్వరరావు మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా శ్రీముఖలింగంలో నిర్వహించనున్న బాలి యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కళింగ రాజ్య పూర్వవైభవాన్ని చాటి చెప్పేందుకు అంతా కలిసి రావాలని కోరారు. నవంబర్ 9వ తేదీన బాలి యాత్ర ఉత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

నిబంధనలు బేఖాతర్!

- జనావాసంలో బాణసంచా విక్రయాలు


పూండి రైల్వే రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన బాణసంచా విక్రయ దుకాణం

వజ్రపుకొత్తూరు రూరల్: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు నిబంధనలు తూచా పాటించాలని జిల్లా అధికారులు హెచ్చరిస్తూ పలు సూచనలు చేస్తున్నారు. అయితే కొంతమంది విక్రయదారులు అధికారుల హెచ్చరికలను, సూచనలను సైతం బేఖాతర్ చేస్తూ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. ప్రధానంగా పూండి రైల్వే రోడ్డులో ఉన్న బాణసంచా దుకాణం జవానాసంలో ఏర్పాటు చేసి ఎలాంటి నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేపడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగితే మంటలను అదుపుచేసేందుకు నీరు, ఇసుక లాంటివి అందుబాటులో లేదు. కాగా దుకాణం పక్కనే ఇళ్లు, ఇతర షాపులు ఉన్నాయి. నిబంధనలు పాటించని దుకాణాలపై అధికారుల పర్యవేక్షణపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా ఫైర్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని పలువురు అధికారుల తీరు పట్ల వారు మండిపడుతున్నారు. కాగా నిబంధనల కోసం విక్రయదారులను అడుగుతుంటే మంత్రి అచ్చెన్నాయుడు పేరు చెబుతున్నారని అధికారులే చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు పాటించని మందుగుండు దుకాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ అగ్నిమాపక శాఖాధికారి వద్ద ప్రస్తావించగా తాము దుకాణాల పరిశీలనకు వెళ్లే సమయంలోనే దుకాణాలు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

క్రికెట్ విజేతలకు సత్కారం


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో పాఠశాల స్థాయిలో జరిగిన జిల్లాస్థాయి హరికేశవ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఇచ్ఛాపురం ఆదర్శపాఠశాల నిలిచింది. ఈ మేరకు క్రికెట్ జట్టుతో పాటు ఎమర్జింగ్ ప్లేయర్ ప్లేయర్‌గా నిలిచిన నిఖిలసాయిని స్థానిక సురంగి రాజా క్రీడా మైదానం ఆవరణలో ఆదివారం ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ ప్రతినిధులు దాసరిరాజు, బత్తుల వెంకటరమణ, డాక్టర్ మట్టా శ్రీనివాసరావు, చాట్ల లోహిదాస్, సాలిన గణేష్, విశ్వనాథం, ఈశ్వరరావు, కోచ్ దక్కత గోపి పాల్గొన్నారు.

'వర్తమానం నుంచి గతం వైపు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: కులవర్గాలు లేనప్పుడే సమాజం అభివృద్ధి చెందుతోందని పలువురు వక్తలు అన్నారు. పలాస రైల్వేస్టేషన్ అతిథి గృహంలో ప్రముఖ రచయత మామిడి కోదండరావు రచించిన 'వర్తమానం నుంచి గతం వైపు'అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎం.ఎస్.ఎస్ అధ్యక్షురాలు పిట్ట గీతారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు పత్తిరి దానేసు మాట్లాడుతూ.. మనువాదానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పుచ్చ దుర్యోధనరావు, సాలిన వీరాస్వామి, కొర్నాన ఉమాపతి, తెప్ప పాపారావు, పిట్ట జోగారావు, తుంగాన శంకరరావు, పిలక కృష్ణారావు, మామిడి గణపతి, నగిరి కరుణాకర్, బోకర దుర్యోధన, నాగమణి, భార్గవి పాల్గొన్నారు.